క్లుప్తంగా

నేడు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

పులిచెర్ల(కల్లూరు)/గంగవరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో మంగళవారం పంచాయతీల అభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పులిచెర్ల, గంగవరం ఎంపీడీవోలు రాజశేఖరబాబు, సురేష్‌బాబు తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

టీచర్‌కు సత్కారం



గంగవరం: మండలంలోని జీఎల్ఎస్ ఫారం జెడ్పీ హైస్కూల్‌లో గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు రమ ఉపాధ్యాయ దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ క్రమంలో ఆమెను సోమవారం పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ఆమె చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయశేఖర్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

పుంగనూరు: పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు ఏరుకుంటూ జీవనం సాగించే 90 ఏళ్ల అనాథ మహిళ సంతగేటులో మృతిచెందింది. ఈ విషయాన్ని స్థానికులు సోమవారం ఏఎస్ఐ అశ్వర్థనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మున్సిపల్ కార్మికులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు కేసు నమోదు చేశారు.

కుష్టువ్యాధిపై అవగాహన కల్పించాలి

బైరెడ్డిపల్లి: ఆరోగ్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా టీబీ, లెప్రసీ అధికారి వెంకటప్రసాద్ ఆదేశించారు. ఆయన సోమవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు, ఓపీలు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ల్యాబ్, వార్డులు, డెలివరి గది తదితరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. వైద్యాధికారిణి శాలిని పాల్గొన్నారు.

మురళీధర్ సేవలు అనిర్వచనీయం



పీవీ మురళీధర్‌ను సన్మానిస్తున్న నేతలు

పలమనేరు: పట్టణానికి చెందిన పీవీ మురళీధర్ పోలీసు శాఖలో చేసిన సేవలు అనిర్వచనీయమని ఎస్సీ టీచర్స్ సంఘం నేత పుష్పరాజ్ తెలిపారు. పీవీ మురళీధర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం పలమనేరులో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలమనేరుకు చెందిన పీవీ మురళీధర్ తెలంగాణ రాష్ట్రంలో ఏఎస్పీగా ఎన్నో సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో చంద్రకుమార్, జయరాం, దళిత నేత సురేష్‌కుమార్, రవికుమార్, యేసయరత్నం, యోహనాన్ పాల్గొన్నారు.

పింఛనర్ల సంఘం నూతన కార్యవర్గం



పలమనేరు: స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రత్నారెడ్డి, కార్యదర్శిగా గురుమూర్తి, ఉపాధ్యక్షులుగా సిద్దమనోహర్, విజయకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, గోవిందురాజులుశెట్టి, పొన్నడి, సంయుక్త కార్యదర్శులుగా పాపయ్య, వెంకటేశ్వర్లు, శ్యామరాజు, మురళీధరపిళ్లై, వేణుగోపాల్, ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో నల్లారెడ్డి, సుబ్బరాజశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

పుంగనూరు: పట్టణంలోని బైపాస్ రోడ్డులో సోమవారం ద్విచక్రవాహనం ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని గుట్టపల్లెకి చెందిన నారాయణ(37) సొంత పనుల నిమిత్తం బైపాస్ రోడ్డు వద్దకు వచ్చాడు. అక్కడ నిలబడి ఉండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. గాయపడిన నారాయణను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

కుప్పం: పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భవనాల తొలగింపు పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుటనున్న రోడ్డు విస్తరణకు అడ్డంగా వున్న ఆర్ అండ్ బీ కార్యాలయాన్ని, దుకాణాలను జేసీబీ యంత్రాలతో తొలగించినట్టు నాయకులు తెలిపారు. గతంలో ఆగిన విస్తరణ పనులను ఈ దఫా పూర్తి చేస్తామన్నారు. ఎం.ఆర్.రెడ్డి సర్కిల్ నుంచి బస్టాండు మీదుగా రైల్వేగేటు వరకు భవనాలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ తెలిపారు.

యూరియా తిప్పలు తీరేనా..?

- సరఫరా కొంత.. అవసరం కొండంత
- వచ్చిన యూరియా పచ్చనేతలకే ఫస్ట్
- క్యూలైన్‌లో రైతులకు తప్పని పాట్లు

నియోజకవర్గంలో యూరియా పంపిణీ ఇలా..
మొత్తం రైతు సేవా సంఘాలు : 15
అందిన యూరియా :4,575 బస్తాలు
రైతులకు కావాల్సిన బస్తాలు: 8 వేలకు పైగా



పలమనేరు మండలంలో యూరియా కోసం క్యూలో వున్న రైతులు



పలమనేరు: యూరియా కోసం పలమనేరు నియోజకవర్గంలోని రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీకావు. మొన్నటి దాకా కాంప్లెక్స్ కొంటేనే యూరియాను అమ్మిన ఫర్టిలైజర్స్ దుకాణాల వారు ఇప్పుడు నోస్టాక్ బోర్డులు పెట్టేశారు. హోల్‌సేల్ కంపెనీల నుంచి డైరెక్ట్‌గా అందే జిల్లాలోని గ్రామోర్ అవుట్‌లెట్లు, రైతు సమాఖ్య దుకాణాల్లో మాత్రం అప్పుడప్పుడు కొంత వరకు వస్తున్న యూరియా కోసం వందలాది మంది రైతులు బారులు తీరుతున్నారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు తీవ్రంగా కష్టపడాల్సిన పరిస్థితి నిత్యకృత్యంగా మారింది. ప్రస్తుతం వరిమడులకు యూరియా వేయాల్సి వుంది. పలమనేరు నియోజకవర్గంలో సోమవారం ఆర్ఎస్‌కేల ద్వారా వ్యవసాయాఖ పంపిణీ చేస్తున్న యూరియా ముందుగా బలమున్న పచ్చ నేతలకే అందింది. దీంతో అవసరమున్న చిన్న, సన్నకారు రైతులు యూరియా దక్కక వెనతిరగాల్సి వచ్చింది.

జిల్లాలోనే వరిసాగు ఎక్కువ..

ఈ దఫా వరిసాగు జిల్లాలోనే పలమనేరు వ్యవసాయ డివిజన్‌లో ఎక్కువగా ఉంది. సాధారణ వరిసాగు మూడువేల హెక్టార్లు కాగా ఈ దఫా 2,800 హెక్టార్లలో సాగైంది. ప్రస్తుతం వరి పంటకు యూరియా కావాల్సి ఉంది. దీంతో యూరియా కోసం రైతులు పడుతున్న అగచాట్లు గత పదేళ్లలో ఎన్నడూ లేదు. అదేవిధంగా పశువులు ఎక్కువగా ఉన్న పలమనేరు నియోజకవర్గంలో 4 వేల హెక్టార్లలో పశుగ్రాసం సాగవుతోంది. మరో నాలుగువేల హెక్టార్లలో మల్బరీ సాగులో ఉంది. వీటికి ప్రస్తుతం యూరియా వేయాల్సిందేనని రైతులు చెబుతున్నారు. ఇలా ఇండగా సోమవారం ఆర్ఎస్‌కేల ద్వారా అధికారులు పంపిణీ చేసిన యూరియా అధికార బలం ఉన్న వారికే ఎక్కువగా దక్కింది. కొందరు పచ్చనేతలు నాలుగైదు బస్తాలను సైతం తీసుకెళ్లారు. అధికారులేమో ఓ రైతుకు ఆధార్ చూపిస్తే ఒక బస్తా మాత్రమేనంటూ టోకెన్లు జారీ చేశారు. చాలామంది అవసరమైన రైతులకు యూరియా దక్కకుండానే పోయింది.

నేడు పలమనేరులో అన్నదాత పోరు



పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలపై మంగళవారం ఉదయం 9 గంటలకు పలమనేరు సమీపంలోని సిల్క్‌ఫామ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు అన్నదాత పోరు పేరుతో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఇందులో పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్టు తెలిపారు. పలమనేరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కాలనీలో ప్రజలతో సమావేశమైన అధికారులు

గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీ యానాది కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. తహసీల్దార్ రేఖ, ఇతర అధికారులు సోమవారం గ్రామంలో పర్యటించి స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తమ కాలనీలో దాదాపు 60 కుటుంబాలు నివాసం ఉంటూ అందరూ అడవిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. పిల్లలు 2 కిలోమీటర్లు దూరం నడిచి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా ఏనుగులతో ప్రతి రోజూ భయంభయంగా బతకాల్సి వస్తోందని తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల వద్దే ఏర్పాటు చేయడం వల్ల షాక్‌కు గురవుతున్నామని పేర్కొన్నారు. గతంలో ఒక యువకుడు కరెంటు స్తంభం నుంచి పడి తీవ్రంగా గాయపడినట్టు గుర్తు చేశారు. స్పందించిన అధికారులు సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

పేదలకు అన్నదానం



నడింపల్లెలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: మద్యం అక్రమ కేసులో రాజంపేట మిథున్‌రెడ్డి మధ్యంతర బెయిల్ వచ్చిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తిరుపతి రెడ్డి సోమవారం పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలో పేదలకు అన్నదానం చేశారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డిపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని తెలిపారు. తామంతా మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో విజయశేఖర్, కరీముల్లా, శ్రీనాథ నాయుడు, నూలు రెడ్డెప్ప, వెంకటరత్నం, రవీంద్ర, నీరజాక్షులు నాయుడు పాల్గొన్నారు.

మామిడి కొమ్మల కత్తిరింపులతో అధిక దిగుబడి

గంగవరం: మామిడి కాయల కోతల అనంతరం కొమ్మల కత్తిరింపు ప్రధానమని, తద్వారా తేనె మంచు పురుగు, మంగును నియంత్రించవచ్చని ఉద్యాన శాఖాధికారి వరప్రసాద్ తెలిపారు. కొమ్మల కత్తిరింపు ద్వారా సమస్యలు అధిగమించడమే కాకుండా వచ్చే ఏడాది ఫలసాయంలో 15 శాతం దిగుబడి పెరుగుతుందన్నారు. కొమ్మలు కత్తిరించి బ్లిటాక్స్ లేదా బర్‌డియాక్స్ పేస్ట్‌ను పూస్తే చెట్టు మొదలు బాగా వృద్ధి చెంది దృఢంగా మారుతుందన్నారు. 20 ఏళ్లు పైబడిన తోటల్లో దిగుబడి పెంచేందుకు అంటు కట్టుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని పేర్కొన్నారు. రైతులు సబ్సిడీ పొందాలంటే తమ వివరాలను ఉద్యానశాఖ అధికారులు లేదా రైతు సేవా సిబ్బందికి సమర్పించాలని తెలిపారు. అదే విధంగా విడి పూల సాగు, కొత్తగా నాటిన పండ్ల తోటలు, బొప్పాయి, అరటి, కాకర, మీర పంటలకు శాశ్వత పందిళ్లు, ప్యాక్ హౌస్‌లు, పాలీ హౌస్‌లు, వ్యక్తిగత, సామూహిక ఫారం పాండ్లకు సైతం ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇస్తోందని వెల్లడించారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పులిచెర్ల(కల్లూరు): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని ఐసీడీఎస్ సీడీపీవో వాణి శ్రీదేవి తెలిపారు. ఆమె సోమవారం పులిచెర్ల ఐసీడీఎస్ పరిధిలోని పులిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకువచ్చిందన్నారు. లింగవివక్ష నేరమన్నారు. విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా వుంచుకోవడం ద్వారా రోగాల రాకుండా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, హెచ్ఎం లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి కోసం అవస్థలు



వ్యవసాయ బోరు నుంచి నీటిని తీసుకుపోతున్న పిల్లలు

గుడుపల్లె: మండలంలోని చీకటిపల్లె ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, కాటపరాజు గుట్ట గ్రామాలలో మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలోని బోర్లలో నీరు అడుగంటడంతో సమస్య ఎదురైందన్నారు. వారం రోజులుగా నీటి కోసం అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్ల నుంచి బండ్లలో నీటిని తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నామన్నారు. బిందె నీటి కోసం కరెంట్ వచ్చేంత వరకు వేచి ఉండి తీసుకుని వస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామకుప్పం (కుప్పం): ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్ సీపీ చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రామకుప్పం మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి కోరారు. ఆయన సోమవారం అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను యూరియా అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలపై మంగళవారం ఉదయం 10 గంటలకు కుప్పం ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబురెడ్డి, సర్పంచులు అశోక్‌రెడ్డి, రాజగోపాల్, గోవిందప్ప, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి కుట్రలకు దీటుగా బుద్ధి చెబుదాం



అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఎంపీ మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్ రావడంతో పూజలు
- అగస్త్యేశ్వరస్వామి కొండపై 101 కొబ్బరికాయలతో మొక్కు చెల్లింపు

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వ కుట్రలకు దీటుగా బుద్ధిచెబుదామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి తెలిపారు. ఎంపీ మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్ వచ్చిన నేపథ్యంలో సోమ వారం ఏ.కొత్తకోటకు చెందిన వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. ఆయన మాట్లాడుతూ అక్రమ కేసుల నుంచి ఎంపీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఐకమత్యంగా పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతంచేసి మళ్లీ సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు దామోదరరాజు, మండల పార్టీ కన్వీనర్ నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, డాక్టర్ ఆడెం హరిబాబు, వైస్ ఎంపీపీ నరసింహులుయాదవ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రామనారాయణరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, కో-ఆప్షన్‌మెంబర్ సాధిక్ బాషా, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, మండల ఇన్‌చార్జి చెంగారెడ్డి, నాయకులు పల్లా వెంకటరెడ్డి, రమేష్‌బాబు, ఆర్.శ్రీనివాసులు, షంషీర్, నరేష్, ప్రభాకర్‌యాదవ్, చెంగారెడ్డి, గణేష్, చిన్నా, షఫీ, వినోద్‌కుమార్‌రెడ్డి, యశోద, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం మెడలు వంచుదాం



పుంగనూరులో అన్నదాతపోరు పోస్టర్లు విడుదల చేస్తున్న అనీషారెడ్డి, వజ్రభాస్కర్‌రెడ్డి, పెద్దిరెడ్డి

పుంగనూరు: రైతు వ్యతిరేక పాలనను సాగిస్తున్న కూటమి ప్రభుత్వ మెడలు వంచేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, పెద్దిరెడ్డి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ వింగ్ డైరెక్టర్ కొత్తపల్లి చెంగారెడ్డి పిలుపునిచ్చారు. వారు సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో పుంగనూరులో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం పలమనేరులో నిర్వహిస్తున్న అన్నదాత పోరును విజయవంతం చేయాలని కోరారు. రైతులకు అవసరమైన యూరియాను పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటల బీమా చెల్లించాలని కోరారు. వర్షాలకు నష్టపోయిన రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐటీ వింగ్ ఇన్‌చార్జ్ ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులు, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి యాదవ్, యూత్ వింగ్ రాష్ట్ర డైరెక్టర్ కొత్తపల్లి చెంగారెడ్డి, పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, రమణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేద్దాం

వి.కోట: రైతు వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఎండగట్టి రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ యువరాజు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో పలమనేరులో మంగళవారం ఉదయం 9 గంటలకు రైతులకు సంఘీభావంగా సిల్క్ ఫామ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేయనున్నట్టు వెల్లడించారు.

పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గ్రామ కమిటీలలోని సభ్యులు పార్టీని గ్రామస్థాయికి తీసుకెళ్లి బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచించారు. ఆయన సోమవారం ఎర్రాతివారిపల్లెలో పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశమయ్యారు. అయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో మొదటి సారిగా ఏర్పాటు చేస్తున్న గ్రామ కమిటీలు రాష్ట్రానికి ఆదర్శం కావాలని సూచించారు. కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పని చేసి పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. కమిటీ సభ్యులకు రానున్న రోజులలో తగు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని పోస్ట్ చేసి, ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలన్నారు. పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి వజ్రభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఇకమీదట ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీని అధికారంలోకి రాకుండా ఎవరూ ఆపలేరని తెలిపారు. అధికారంలోకి వచ్చాక కార్యకర్తలకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకురాలు అనీషారెడ్డి మాట్లాడుతూ కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. గత ఎన్నికలలో పార్టీ మెజారిటీ సాధించేలా అందరూ కష్టపడి పని చేశారని అభినందించారు. గ్రామాలలో నాయకుల మధ్య స్పర్ధలు ఏర్పాడితే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుపోరు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, నాయకులు కల్యాణ భరత్, రెడ్డెప్పరెడ్డి, ప్రకాశ్ రెడ్డి, పుత్రాజు, ఇమ్రాన్, నారాయణ రెడ్డి, హేమసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

కుప్పం: నియోజకవర్గంలోని రైతులకు అన్ని విధాలా అండగా వుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ జి.ఎం.రాజు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో యూరియా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 270 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో వున్నట్లు తెలిపారు. అదనంగా మరో 40 మెట్రిక్ టన్నుల యూరియా తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో పాటు కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేసి రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని విక్రయించుకునేలా చూస్తామన్నారు. ఎలాంటి సమస్యలైనా పరిష్కరించేందుకు మార్కెట్ కమిటీ సిద్ధంగా వుందన్నారు.

యూరియా పంపిణీ తనిఖీ

సదుం/రొంపిచెర్ల: రైతులకు అవసరమైన మేరకు యూరియా అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం సదుం మండలం సదుం, నడిగడ్డ, తిమ్మానాయనపల్లె, ఎర్రాతివారిపల్లె, రొంపిచెర్ల మండలం బండకిందపల్లె, బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల, గానుగచింత, పెద్దమల్లెల రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న యూరియా పంపిణీని సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించి, నానో యూరియాను వినియోగించాలన్నారు. యూరియా కోసం పంపిణీ కేంద్రాల వద్ద రైతులు బారులుతీరారు. పోలీసుల బందోబస్తు మధ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో సదుంలో ఏడీఏ శివకుమార్, మానిటరింగ్ అధికారి లక్ష్మీప్రసన్న, ఏఓ సుధాకర్, రొంపిచెర్లలో తహసీల్దార్ అమర్‌నాథ్, ఏడీఏ శివకుమార్, ఏవో శ్రావణి పాల్గొన్నారు. పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఆరు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్నారు. తహసీల్దారు జయసింహ, ఏవో లీలా కుమారి కల్లూరు రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి రైతుకు యూరియా అందేలా చూస్తామన్నారు. ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

పెంగరగుంటలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ



పలమనేరు: మండలంలోని పెంగరగుంట పంచాయతీలో సోమవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆ పంచాయతీ వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు గత ఎన్నికల్లో గుప్పించిన హామీలు.. చేస్తున్న మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా జనానికి విపులంగా వివరించారు. రాజారెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీతో జొన్న విత్తనాలు

రొంపిచెర్ల: మండలంలోని రైతులకు సబ్సిడీతో జొన్న, మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు మండల పశు వైద్యాధికారి ఉష తెలిపారు. మండలానికి 4,300 కిలోల జొన్నలు, 2,600 కిలోల మొక్కజొన్నలు వచ్చాయని తెలిపారు. వీటిని రొంపిచెర్ల, గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. మొక్కజొన్నలు 75 శాతం సబ్సిడీతో ఒక కిలో రూ.17లకు, జొన్నలు కిలో రూ.23లతో ఇస్తామని తెలిపారు.

నేత్రదానం అందరి బాధ్యత



పులిచెర్లలో ర్యాలీ చేస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

బైరెడ్డిపల్లి: నేత్ర దానం అందరి బాధ్యత అని కంటి వైద్యాధికారి సురేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు నేత్ర దానంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేత్రం దానం చేసి మరొకరికి చూపును ప్రసాదించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయ్‌చంద్ర, శాలిని, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం–మహాదానం

పులిచెర్ల(కల్లూరు): దానాల్లోకి నేత్ర దానం మహాదానమని పులిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సిబ్బందితో కలిసి నేత్ర దానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేత్రాలు దానం చేయడం వల్ల అంధులకు చూపు ప్రసాదించవచ్చన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, సిబ్బంది జ్యోతి కుమార్, రాణి, బిందు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట కేవీసీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారంసమావేశమయ్యారు. పూర్వ విద్యార్థి శ్రీరామా మెడికల్స్ రవి ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక పేరుతో కలిశారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. అంతా కలిసి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు.

ఆర్‌పీఎఫ్ అధ్యక్షుడిగా విజయకుమార్

పుంగనూరు: రాయల్ పీపుల్స్ ఫ్రంట్ పట్టణ అధ్యక్షుడిగా విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడు మధుసూదన్‌రాయల్ ఆధ్వర్యంలో సోమవారం సంఘం ఎన్నికలు నిర్వహించారు. బలిజ కులస్తులను ఐకమత్యం చేసి ఒకేబాటలో పయనించేందుకు కృషి చేస్తామని విజయకుమార్ తెలిపారు.